క్లుప్తంగా

వృద్ధులకు దుస్తుల పంపిణీ

కొత్తపల్లి: కొండెవరం శివారు కాశివారి పాకల్లో బుధవారం వైఎస్సార్ సీపీ నాయకుడు మాసు కొండ మహేశ్ ఆధ్వర్యంలో వృద్ధులకు దుస్తులను పంపిణీ చేశారు. తన తండ్రి శంకర్రావు జ్ఞాపకార్థం దుస్తులు అందజేశారు. సుమారు రూ.5 వేల విలువ జేసే దుస్తులను 25 మంది వృద్ధులకు అందించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల వాడకంపై అవగాహన పెంచుకోవాలి



ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న శ్యామ్‌ప్రసాద్

పెద్దాపురం: రైతులు నానో ఎరువుల వాడకంపై అవగాహన పెంచుకోవాలని ఇఫ్కో సంస్థ ఏరియా మేనేజర్ జి.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. కాండ్రకోట గ్రామంలో బుధవారం రైతు పొలంబడి కార్యక్రమం వీహెచ్ఏ మోటుకూరి సత్తిబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ వచ్చే ఖరీఫ్ నాటికి ఇఫ్కో సంస్థ నానో ఎరువులను అందుబాటులోకి వస్తుందన్నారు. ప్రస్తుతం డిఏపీ ధర రూ.1350 ఉంటే నానో రూ.600లకే అందిస్తుందన్నారు. అనంతరం ఎరువుల వాడకంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వీఏఏ స్రవంతి, రైతులు పాల్గొన్నారు.

మెప్మా ఆర్పీల శిక్షణ ప్రారంభం



శిక్షణకు హాజరైన కాకినాడ కార్పొరేషన్ మెప్మాలోని ఆర్పీలు

సామర్లకోట: కాకినాడ జిల్లా పరిధి మున్సిపాలిటీలో మెప్మా రీసోర్సు పర్సన్లకు ఇస్తున్న శిక్షణలో భాగంగా బుధవారం కాకినాడ కార్పొరేషన్ పరిధిలోని ఆర్పీలకు రెండు రోజుల శిక్షణను మెప్మా జిల్లా రీసోర్సు పర్సన్ రాజశేఖర్ ప్రారంభించారు. కార్పొరేషన్ పరిధిలో 209 మందికి మెప్మా ఆర్పీలు ఉండగా బ్యాచ్‌కు 52 మంది చొప్పున శిక్షణ ఇస్తున్నామని డీఆర్పీ అన్నారు. జూన్ ఒకటో తేదీతో కాకినాడ కార్పొరేషన్ ఆర్పీల శిక్షణ ముగుస్తుందన్నారు. మెప్మా పరిధిలోని ఆర్పీలు తమ విధులు సక్రమంగా నిర్వహించి ఆన్‌లైన్‌లో పొందుపర్చడానికి శిక్షణ దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ మెప్మా సీఎంఎం, సీఓలు పాల్గొన్నారు.

సర్పంచులకు అవగాహన



సర్పంచ్‌లకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ

సామర్లకోట: ప్రపంచ పర్యావరణ దినోత్సవ కాంపెయిన్‌పై బుధవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద మండల పరిధిలోని సర్పంచ్‌లకు మిషన్ లైఫ్ ప్రతిజ్ఞ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీఓ డి.శ్రీలలిత అధ్యక్షత వహించగా ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, ఈఓపీఆర్డీ వై.శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు సాగుదారు హక్కు పత్రాల పంపిణీ

కొత్తపల్లి: కౌలు రైతులు తప్పనిసరిగా సాగుదారు హక్కు పత్రాలను పొందాలని గ్రామ రెవెన్యూ అధికారి పాండవులు అన్నారు. మండలంలోని శ్రీరాంపురం, రమణక్కపేటలోని రైతు భరోసా కేంద్రాల వద్ద కౌలురైతులకు సాగుదారు హక్కు పత్రాలను బుధవారం పంపిణీ చేశారు. అనంతరం రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పత్రాల ద్వారా కౌలు రైతులు బ్యాంకు నుంచి రుణాలను పొందవచ్చని ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు పంట నష్టాన్ని కూడా పొందవచ్చన్నారు. ప్రభుత్వం సబ్సిడీపై అందించే ఎరువులు, పురుగుమందులు, విత్తనాలను తీసుకోవచ్చన్నారు. కౌలు రైతులు తప్పనిసరిగా ఈ హక్కు పత్రాలను పొందాలని సూచించారు. గురువారం కొత్త మూలపేట, మూలపేటలో నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు.

వివిధ పోస్టులకు ఇంటర్వ్యూలు

కాకినాడ క్రైం: డీఎంఈ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం ఆదేశాల మేరకు రంగరాయ వైద్య కళాశాలలోని పలు కీలక విభాగాలలో సీనియర్ రెసిడెంట్ల నియామకానికి వాకిన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉండి, అర్హులైన పీజీ విద్యార్థులు ఈ నెల 26న ఉదయం 11 గంటలకు కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో నిర్వహించే వాకిన్ ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు ఆర్ఎంసీకాకినాడ.కాం వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

అవగాహనే మహా భాగ్యం

- దోమల వ్యాప్తి నివారణపై చైతన్యం
- డెంగీపై వైద్య సిబ్బంది అప్రమత్తం
- గ్రామాల్లో అవగాహన సదస్సులు



గొల్లప్రోలు మండలంలో రచ్చబండ వద్ద డెంగీ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది



ఇళ్ల వద్ద మహిళలకు అవగాహన కల్పిస్తూ..

పిఠాపురం: ఆరోగ్యమే మహాభాగ్యం అంటుంటారు పెద్దలు.. అలాంటి ఆరోగ్యానికి సమష్టి చర్యలతోనే బాటలు పడతాయి.. దీనికోసం వైద్య ఆరోగ్య సిబ్బంది నిత్యం శ్రమిస్తున్నారు.. ఇళ్ల వద్ద చెత్తాచెదారం, మురుగునీటి నిల్వలే దోమల వ్యాప్తికి కారణం. దీనివల్ల డెంగీ తదితర జ్వరాలు ప్రబలే అవకాశం ఉంది. ఈ జ్వరాల నివారణకు ప్రభుత్వ ఆదేశాలతో వైద్య సిబ్బంది గ్రామాల బాట పట్టారు. టైగర్ దోమ, పులి చార దోమతో జాగ్రత్తగా ఉండాలని ప్రజల్లో చైతన్యం నింపుతున్నారు. జాతీయ డెంగీ నివారణా దినోత్సవం సందర్భంగా వారం రోజులుగా డెంగీ వ్యాప్తిపై వైద్య సిబ్బంది ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. పిఠాపురం నియోజకవర్గంలో గొల్లప్రోలు పట్టణ, రూరల్‌లోనూ, చేబ్రోలు, విరవ, మల్లాం, కొత్తపల్లి, కొమరగిరి, నాగులాపల్లితో కలిపి మొత్తం 8 పీహెచ్‌సీలు ఉన్నాయి. ఇందులో గొల్లప్రోలు మండల పీహెచ్‌సీ పరిధిలో పది గ్రామాల్లో వ్యాధుల నివారణకు అవగాహన సదస్సులు విరివిగా జరుగుతున్నారు. ప్రజలను చైతన్య పరుస్తూ సిబ్బంది ముందుకు సాగుతున్నారు. మిగతా పీహెచ్‌సీల్లోనూ ఈ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని పలువురు కోరుతున్నారు.

దోమలతో జాగ్రత్త

టైగర్, పులిచార దోమలు నీరు నిల్వ ఉన్నచోట్ల గుడ్లు పెడతాయి. డెంగీ హెమరేజిక్ ఫీవర్, డెంగీ హెమరేజిక్ షాక్ సిండ్రోమ్ అనే ప్రమాదకరమైన జ్వరాలు ఈ దోమలు కుట్టడం వల్ల సంభవిస్తాయి. ఈ వ్యాధి సోకినప్పుడు హఠాత్తుగా తీవ్రమైన జ్వరం మొదలవుతుంది. కళ్లు కదిలించలేని పరిస్థితి, ఎముకలు, కండరాల్లో తీవ్రమైన నొప్పి, శరీరంపై పొక్కులు వస్తాయి. వాంతులు వికారంతో కూడిన మల విసర్జన, వివిధ శరీర భాగాల్లో రక్త స్రావం వంటివి సంభవిస్తాయి. ఈ దోమలు ఇంటి పరిసరాల్లో నీటి నిల్వల్లో ఎక్కువగా పెరుగుతాయి. ఇవి పగలు, రాత్రి ఎప్పుడైనా కుడతాయి. వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించి రక్త పరీక్ష (ఎన్ఐవీ) చేయించుకోవాలి. దీని నివారణకు చికిత్స లేదు కానీ లక్షణాలను బట్టి వైద్య సేవల ద్వారా తగ్గించే అవకాశాలు ఉన్నాయి. చికిత్స చేయించకుండా అలక్ష్యం వహిస్తే ప్రాణాలకే ప్రమాదం ఏర్పడుతుంది. ముందస్తు చర్యల ద్వారా నివారణకు వైద్య సిబ్బంది అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు.

నివారణా చర్యలు ఇవీ..

దోమ తెరలు వాడడం, ఇంటి కిటికీలకు తలుపులకు జాలీలు వాడడం, ఇంటి లోపల, బయట నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం మంచిది. నీటి తొట్టెలు శుభ్రం చేసుకోవడం, నీరు నిల్వ ఉండే ఖాళీ డబ్బాలు, కొబ్బరి బొండాలు వంటివి లేకుండా జాగ్రత్త పడడం, వస్తువులలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం, పూల కుండీలు, ఎయిర్ కూలర్లలో నీరు ఎప్పటికప్పుడు మార్చుకోవడం వంటివి, దోమల నివారణకు మందుల పిచికారీ చేయడం ఉత్తమం.

ప్రజలకు వివరిస్తున్నాం..

డెంగీ ప్రమాదకరమైన రోగం. ఇది వ్యాప్తి చెందకుండా నివారణా చర్యలు చేపడుతున్నాం. గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి ఇళ్ల పరిసరాలను పరిశీలించి దోమలు వ్యాప్తి చెందే అవకాశాలు ఉంటే వాటిని శుభ్రం చేయిస్తున్నాం. డెంగీ వ్యాధి సోకితే కలిగే నష్టాలు, ప్రమాదాన్ని ముందుగానే ప్రజలకు వివరించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేస్తున్నాం. వారం రోజులుగా డెంగీ నివారణా దినోత్సవ కార్యక్రమాలు చేపడుతున్నాం. – అహ్మద్‌బాషా, హెల్త్ సూపర్ వైజర్, గొల్లప్రోలు రూరల్

పథకాల అమలులో మనమే ముందంజ

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- గొల్లప్రోలులో గడప గడపకూ..



గొల్లప్రోలులో పథకాలను వివరిస్తూ బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రం దేశంలోనే ముందంజలో ఉందని, ఇతర రాష్ట్రాలు మన పథకాలను ఆదర్శంగా తీసుకుంటున్నాయని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. గొల్లప్రోలు నగర పంచాయతీ పరిధి ఈబీసీ కాలనీ 20వ వార్డులో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వార్డులో పర్యటించిన ఆయన ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఎవరికి ఏ పథకం అందుతుందో లబ్ధిదారులకు వివరించి, ఏమైనా లోపాలు ఉన్నాయా అని అడిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నామన్నారు. వలంటీర్ వ్యవస్థతో పథకాలు అర్హుల దరిచేరాయన్నారు. గతంలో ఏ చిన్న పని కావాలన్నా మండల కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు ఇంటి వద్దే గ్రామ సచివాలయాలు ఉండడంతో క్షణాల్లో పనులు పూర్తవుతున్నాయన్నారు. అందరికీ అన్నం పెట్టే రైతన్నకు ప్రభుత్వం అండగా ఉంటోందన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వ సేవలను రైతుల ముంగిటకే తీసుకు వచ్చారన్నారు. కౌలు రైతులకు సైతం అన్ని పథకాలు వర్తించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుందని ఆయన తెలిపారు. అనంతరం పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమిపూజ నిర్వహించారు. గొల్లప్రోలు నగర పంచాయతీ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పర్ల రాజా, సొసైటీ చైర్మన్ జ్యోతుల భీముడు, వైఎస్సార్ సీపీ నేతలు గండ్రేటి శ్రీరామచంద్రమూర్తి, మొగలి అయ్యారావు, మొగలి సాంబశివరావు, తెడ్లపు చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని ఆత్మహత్య



జస్విణి (ఫైల్)

సామర్లకోట: పదో తరగతి పాస్ కాలేదన్న ఆవేదనతో ఓ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. మండలంలోని ఉండూరు జెడ్పీ హైస్కూల్‌లో బస్వా జస్విణి (16) పదో తరగతి 2021–22లో చదివింది. అప్పట్లో అనారోగ్యానికి గురవడంతో సిలైన్లు పెట్టించుకుని మరీ పబ్లిక్ పరీక్షలు రాసింది. లెక్కలు, సైన్సు, సోషల్ సబ్జెక్టుల్లో ఫెయిలవడంతో మళ్లీ 2022–23లో ఆ పరీక్షలు రాసింది. అయినా ఫెయిలైందని హెచ్ఎం వెంకట రెడ్డి తెలిపారు. వచ్చే నెల 2 నుంచి జరిగే సప్లిమెంటరీకి ఫీజు చెల్లించింది. అనారోగ్యంతో బాధపడుతూ పరీక్ష పాస్ కాలేకపోతున్నాననే ఆవేదనతో జస్విణి బుధవారం సాయంత్రం ఇంట్లో ఉన్న ఫినాయిల్ తాగింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను తల్లిదండ్రులు కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ జస్విణి మృతి చెందింది. సామర్లకోట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలని జిల్లా విద్యాశాఖాధికారి కేఎస్‌వీఎస్ అన్నపూర్ణ అన్నారు. బుధవారం వీబీవీఆర్ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఎంఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న వేసవి వినోదం ముగింపు వేడుకలలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నపూర్ణ మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదివి గొప్ప శాస్త్రవేత్తలుగా, ఇంజినీర్లుగా, డాక్టర్లుగా ఎదగాలని ఆకాంక్షించారు. కాకినాడ డివిజన్ ఉపవిద్యాశాఖాధికారి ఆర్‌జే డేనియల్ రాజు మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశలకు అనుగుణంగా పిల్లలు చదువుకోవాలన్నారు. విద్యార్థులు మానసిక ధైర్యంతో ముందుకు సాగితే ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనే తత్వం అలవడుతుందన్నారు. బాలవేదిక కన్వీనర్ నోరి బలరామకృష్ణ మాట్లాడుతూ మారుతున్న సామాజిక, ఆర్థిక పరిస్థితులపై అవగాహన పెంచుకోవాలన్నారు. వేసవి వినోదం కన్వీనర్ కేసరి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ కార్యక్రమం నిర్వహణకు సహకరించిన వీబీవీఆర్ చారిటబుల్ ఫౌండేషన్ అధ్యక్షుడు కె.సత్యనారాయణకు ధన్యవాదాలు తెలిపారు. ఇందులో 27 పాఠశాల నుంచి 128 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ లిటరరీ చైర్మన్ పీవీ సుబ్బారావు, శిక్షకుడు పిల్లి గోవిందరాజులు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.అమరేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులపై నమ్మకం కలిగేలా పనిచేయాలి

- జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్
- పోలీసు స్టేషన్ల తనిఖీ



గొల్లప్రోలు పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

పిఠాపురం: పోలీసు స్టేషన్‌కు వెళితే తమకు న్యాయం జరుగుతుందని ప్రజలకు నమ్మకం కలిగేలా పని చేయాలని జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ పోలీసు సిబ్బందికి సూచించారు. ఆయన బుధవారం గొల్లప్రోలు, పిఠాపురం రూరల్ పోలీసు స్టేషన్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, కేసుల దర్యాప్తు పురోగతిని తెలుసుకున్నారు. రిసెప్షన్ కౌంటర్‌ను పరిశీలించి మహిళా పోలీసులను రిసెప్షనిస్టుగా ఉంచి, స్టేషన్‌కు వచ్చే బాధితులతో గౌరవంగా మాట్లాడి వారి బాధలు సానుకూలంగా విని వాటిని చట్ట పరిధిలో పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును పరిశీలించి, పట్టదగిన నేరమైతే వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని ఆయన ఆదేశించారు. మహిళలు, బలహీన వర్గాలపై దాడులు నేరాలు జరిగితే వెంటనే కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చి చార్జిషీట్ సైతం సకాలంలో దాఖలు చేయాలన్నారు. గ్రామాల్లో సారా తయారీ, అమ్మకం రవాణా, వినియోగంపై ప్రత్యేక దృష్టి పెట్టి నిర్దిష్ట కార్యాచరణ ద్వారా వాటిని అరికట్టాలన్నారు. జూదాలు, కోడి పందాలు వంటి అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలని సిబ్బందికి సూచించారు. పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు గ్రామ, వార్డు సచివాలయాల వద్ద అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) టోల్‌ఫ్రీ నంబరు 14400, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) టోల్‌ఫ్రీ నంబరు 14500, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ నేరాలు 1930, దిశ యాప్, డయల్ 112, 100 నంబర్లు వాటి ఉపయోగం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. అవినీతికి తావు లేకుండా పోలీసు సిబ్బంది పని చేయాలని సూచించారు. ఈయన వెంట ఎస్సైలు అబ్దుల్‌నబీ, వినయ్‌ప్రతాప్ పలువురు పోలీసు సిబ్బంది ఉన్నారు.

మహిళ అదృశ్యం

కరప: ఓ మహిళ అదృశ్యంపై కేసు నమోదైంది. కరప పోలీసుల కథనం మేరకు.. నడకుదురు గ్రామానికి చెందిన గడాడ పద్మారావు కుమార్తె మనీషా తాళ్లరేవులోని అఫెక్స్ ఫ్రాన్స్ కంపెనీలో పనిచేస్తోంది. ఈ నెల 23న పని చేసేందుకు కంపెనీకి వెళ్లింది. అదేరోజు మధ్యాహ్నం 12.30 గంటలకు స్నేహితులతో కలసి బయటకు వెళ్లినట్టు ఇంటికి ఫోన్‌చేసి చెప్పింది. ఈ మేరకు ఆమె సోదరుడు గడాడ అప్పాజీ బుధవారం రాత్రి కరప పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కాలుష్య నియంత్రణపై దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: జిల్లాలోని పరిశ్రమల్లో భద్రతతో పాటు కాలుష్య నియంత్రణ చర్యలు పాటించేలా అధికారులు పటిష్ట పర్యవేక్షణ కొనసాగించాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ కోర్టు హాలులో జిల్లా పారిశ్రామిక, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. పరిశ్రమలు, ఏపీఐఐసీ, గ్రౌండ్ వాటర్, రవాణా, అగ్నిమాపక, పంచాయతీ, ఫ్యాక్టరీస్, పొల్యూషన్ తదితర శాఖల అధికారులు హాజరయ్యారు. తొలుత గత సమావేశంలో తీర్మానించిన అంశాలకు సంబంధించి తీసుకున్న చర్యలపై చర్చించారు. పరిశ్రమల్లో భద్రతతో పాటు పారిశ్రామిక కార్యకలాపాలతో పర్యావరణం కలుషితం కాకుండా జల వనరులపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. అవసరమైన చోట సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు (ఎస్‌టీపీ) ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పారిశ్రామిక యూనిట్లకు సత్వర అనుమతుల జారీకి అమలులో ఉన్న ఏపీ సింగిల్ డెస్క్ విధానం కింద 2023, ఏప్రిల్ 11 నుంచి ఈనెల 22 వరకు 53 దరఖాస్తులకు గాను వివిధ శాఖల పరిధిలో 35 దరఖాస్తులు ఆమోదం పొందినట్లు వివరించారు. మిగిలిన దరఖాస్తులను నిర్దిష్ట ఎస్ఎల్ఏ గడువులోగా పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా (ఎంఎస్ఎంఈ) పరిశ్రమలకు సంబంధించి పారిశ్రామిక అభివృద్ధి విధానాలు (2015–20, 2020–23), వైఎస్సార్ జగనన్న బడుగు వికాసం పథకం పరిధిలో 25 యూనిట్లకు ప్రోత్సాహకాల కింద రూ.2.53 కోట్లు మంజూరు చేశారన్నారు. సమావేశంలో పరిశ్రమల శాఖ జీఎం టి.మురళి, ఏడీ కె.కృష్ణారావు, ఎల్‌డీఎం సీహెచ్ఎస్‌వీ ప్రసాద్, డీపీవో ఆర్.విక్టర్, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ డి.రాధాకృష్ణ, ట్రాన్స్‌పోర్టు అధికారి పీవీ సాయిప్రసాద్ తదితరులు హాజరయ్యారు.

కల్యాణం... వైభోగం



టౌన్‌హాల్ ఎదురుగా సీతారామస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

బోట్‌క్లబ్: స్థానిక భానుగుడి సెంటర్‌లో ఉన్న ఉషారాజరాజేశ్వరీ సమేత భానులింగేశ్వరస్వామి వార్షిక కల్యాణం బుధవారం రాత్రి కన్నుల పండువగా జరిగింది. ఉదయం ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. రాత్రి కల్యాణాన్ని ఎంతో వైభవంగా జరిపారు. ఆలయ కమిటీ చైర్మన్ వాకాడ సత్తిబాబు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ ఈఓ ఎం.మురళీ వీరభద్రరావు ఏర్పాట్లు చేశారు. కల్యాణం అనంతరం స్వామివారి ప్రసాదం పంపిణీ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు కర్రి బుచ్చిరెడ్డి, ఎన్‌వీ సాయిబాబా, రామ్‌గోపాల్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక మెయిన్‌రోడ్డులోని టౌన్‌హాల్ ఎదురుగా ఉన్న సీతారామస్వామి ఆలయంలో స్వామి కల్యాణం జరిగింది. ఆలయ అర్చకుడు పాణింగపల్లి మాధవాచార్యులు ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు శాస్త్రోక్తంగా కల్యాణం జరిపారు. ఆలయ ఈఓ బీవీఆర్ చౌదరి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సెంట్రల్ జైలు ఖైదీ మృతి

కాకినాడ క్రైం: రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో శిక్ష అనుభవిస్తున్న రిమాండ్ ఖైదీ అనారోగ్యంతో చికిత్స పొందుతూ కాకినాడ జీజీహెచ్‌లో మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. విజయనగరం జిల్లా రాజాం మండలం మెంతిపేట గ్రామానికి చెందిన పడాల హరి (63)కి సివిల్ వివాదంలో జైలుశిక్ష పడగా, ఈ నెల 12వ తేదీన రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తీసుకువచ్చారు. అయితే ఈనెల 15న మధుమేహం, రక్తపోటుతో తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం 17న జీజీహెచ్‌కు తీసుకొచ్చారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతి చెందాడు. ఈ ఘటనపై బుధవారం రాత్రి స్థానిక వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



ఎంపీడీఓలకు లీగల్ సంబంధమైన అంశాలపై శిక్షణ ఇస్తున్న త్రినాథరావు

సామర్లకోట: చట్టాలపై ఎంపీడీఓలు అవగాహన పెంచుకోవాలని న్యాయవాది త్రినాథరావు అన్నారు. రాష్ట్రంలో నూతనంగా ఎంపికైన ఎంపీడీఓలకు ఇస్తున్న శిక్షణలో భాగంగా బుధవారం న్యాయ పరమైన అంశాలపై వారికి శిక్షణ ఇచ్చారు. సమాచార హక్కు చట్టం ప్రకారం అడిగిన విషయాలకు సకాలంలో సమాధానం ఇవ్వాలన్నారు. కోర్టు నోటీసులు వచ్చిన సమయంలో వెంటనే స్పందించాలని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 40 మంది ఎంపీడీఓలు నూతనంగా బాధ్యతలు స్వీకరించగా వారికి రాష్ట్ర ప్రభుత్వం ఆరు నెలల పాటు శిక్షణ ఇవ్వడానికి ఏర్పాట్లు చేసింది. దీనిలో భాగంగా గత నెలలో బాపట్ల విస్తరణ శిక్షణ కేంద్రంలో ఎంపీడీఓలో శిక్షణ పూర్తి చేసుకొని ఈనెల ఒకటో తేదీన స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రానికి 34 మంది ఎంపీడీఓలు శిక్షణకు వచ్చారు. సోమ, మంగళవారం ఫీల్డ్ విజిట్ శిక్షణ అనంతరం బుధవారం క్లాసు రూమ్ శిక్షణ జరిగింది.

సృజనాత్మకతను వెలికితీసేందుకే శిక్షణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

పెద్దాపురం: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకే వేసవి శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్టు సామర్లకోట ఉపాధ్యాయులు వి.లచ్చిబాబు, రిషి కుమార్ అన్నారు. బుధవారం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు అధ్యక్షతన జరిగిన శిక్షణా తరగతుల్లో ఆయన మాట్లాడారు. గ్రంథాలయంలో నిర్వహించే వేసవి శిక్షణా తరగతులు విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఎంతగానో దోహదపడతాయన్నారు. విద్యార్థులను ప్రోత్సాహించడం తల్లిదండ్రుల బాధ్యత అన్నారు. అనంతరం స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, పలు అంశాలపై విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది బుల్లియ్య, తదితరులు పాల్గొన్నారు.

విరబూసిన బ్రహ్మకమలాలు



కొత్తపల్లిలో వికసించిన బ్రహ్మకమలాలు

కొత్తపల్లి: స్థానిక ప్రకృతి వ్యవసాయ రైతు ఉల్లి సురేష్ స్వగృహం వద్ద బ్రహ్మకమలాలు విరబూశాయి. ఒకే సారి పది బ్రహ్మ కమలాలు విరబూయడంతో చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అందరూ తమ సెల్ ఫోన్లలో బంధించారు.

1 నుంచి జెడ్పీటీసీ సభ్యులకు శిక్షణ

సామర్లకోట: వచ్చే నెల ఒకటో తేదీ నుంచి 17 వరకూ 11 జిల్లాలకు చెందిన జెడ్పీటీసీ సభ్యులకు స్థానిక విస్తరణ, శిక్షణ కేంద్రం(ఈటీసీ)లో శిక్షణ ఇవ్వనున్నారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లోని 221 మంది జెడ్పీటీసీలకు ఈ శిక్షణ ఇవ్వనున్నారు. బ్యాచ్‌కు మూడు రోజుల చొప్పున ఆరు బ్యాచ్‌లలో శిక్షణ ఇస్తామని ఈటీసీ ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ తెలిపారు. శిక్షణను ప్రారంభించేందుకు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖా మంత్రి బూడి ముత్యాలనాయుడు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. ఇప్పటికే ఇక్కడ ఎంపీపీలకు శిక్షణ పూర్తి చేశారు. అలాగే రాష్ట్రంలో కొత్తగా బాధ్యతలు స్వీకరించిన 34 మంది ఎంపీడీఓలకు ఈ నెల ఒకటి నుంచి ఇస్తున్న శిక్షణ 31వ తేదీతో ముగియనుంది.

ప్రశాంతంగా ఐసెట్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): కాకినాడ డిజిటల్ అయాన్ కేంద్రంలో ఐసెట్–23 పరీక్ష బుధవారం ప్రశాంతంగా నిర్వహించారు. ఉదయం నిర్వహించిన పరీక్షకు 520 మందికి గాను 481 మంది హాజరు కాగా మధ్యాహ్నం పరీక్షకు 520కి గాను 485 మంది హాజరయ్యారు.

ఆత్మీయ స్వాగతం



జగనన్న విద్యాదీవెన పథకం ప్రారంభోత్సవానికి బుధవారం కొవ్వూరు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు కలుసుకుని పుష్పగుచ్ఛం అందజేశారు.